

# జోమ్‌పూర్ ఖాజీ

జోమ్‌పూర్ అనే ఊర్లో జోమ్‌పూర్‌ఖాజీ అనే ఉస్తాదు (టీచరు) ఉండేవాడంట. ఆయన బలే షేక్‌షిల్లి. మజాక్ మనిషి. ఇస్కూల్లో పాఠాలు బాగా చెప్పినా వాళ్లతో యీళ్లతో చతుర్లు ఆడటంలో ఫస్టు ఉండేవాడంట.

ఒకరోజు పిలకాయలకు పాఠాలు చెప్తా ఉంటే పిలకాయలు అలివిగాకుండా ఆయనను సతాయిస్తా ఉన్నారంట. కొట్టినా తిట్టినా మాట వినే పిలకాయలైతే గదా. ఆయన చూసి చూసి విసిగి పోయి 'ఒరే.. మీలాంటి గాడిదలని ఎంతమందిని మనుషుల్ని చేసేదిరా' అన్నాడంట పెద్దగా.

అప్పుడే ఆ ఇస్కూలు పక్క నుంచి ఒక ధోబీ గాడిద మీద గుడ్డలు వేసుకొని సాకిరేవుకు పోతా పోతా ఆ మాటలు విన్నాడు.

అంతే. లటక్కన ఆగిపోయినాడు. పాపం ఆ ధోబీకి పిలకాయలు లేరు. గాడిదనే పిల్లోడి లెక్కన సాక్కుంటా ప్రాణప్రదంగా చూసుకుంటా ఉన్నాడు. ఇప్పుడు ఖాజీ మాటలు విన్నాక అరెరె ఖాజీసాబు నా గాడిదను కూడా మనిషిగా మారిస్తే బాగుంటుంది కదా అనుకున్నాడు. అనుకుని నేరుగా యిస్కూల్లోకి పోయి ఖాజీసాబుని పిలిచాడు.

'ఏంది?' అని అడిగినాడు ఖాజీ.

'సాహెబ్... మీరు మామూలు మనుషులుకారని వాళ్ల నోటి గుండా వీళ్ల నోటి గుండా ఇన్నాళ్లు వింటా ఉండేవాణ్ణి. ఇవాళ మీ నోటి గుండానే మహిమగల మాట విన్నాక నా మనసు ఆగటం లా. మీరు నాక్కూడా సాయం చేయాల. ఇంతకాలం మీరు చాలా గాడిదలని మనుషులుగా మార్చి ఉంటారు. బాబ్బాబూ.. కాస్త నా గాడిదను కూడా మనిషిగా మార్చండి. పిల్లలు లేనోణ్ణి. కనికరించండి' అన్నాడు.

ఖాజీగారికి పకపకా నవ్వొచ్చేసింది. కానీ దానిని బయటపెట్టకుండా కడుపులోనే నవ్వుకొని ధోబీకి తగిన తమాషా చూపించాలను కొని 'అరె... భాయ్... అదెంత పని. ఇంతకాలం ఈ సంగతి నాకు చెప్పకుండా ఎందుకు ఉన్నావు. గాడిదలని మనుషులుగా చేసే పని మనకి పుట్టినప్పటి నుంచి తెలుసు కదా. సరే.. నీ గాడిదను ఆ గుంజకి కట్టేసి పో. వారం రోజుల తర్వాత రా. మనిషిని తీసుకొని పోదూ గానీ' అన్నాడు.

ధోబీ సంతోషంగా ఆ మాటలు విని, గాడిదకు బుద్ధులు చెప్పి, కళ్లారా చూసుకొని, దానిని గుంజకు కట్టి వెళ్లిపోయినాడు. ఇంటికి పోయి భార్యకు ఆ సంగతి చెబితే ధోబీ భార్య కూడా బలే సంతోషపడిపోయింది.

'పోనీలే. అల్లా ఇన్నాళ్లకైనా మన మొర విన్నాడు. ఖాజీగారు మన గాడిదను మనిషిగా చేస్తే అంతే చాలు' అంది.



వారం రోజులు గడిచాయి. ధోబీ ఆదరాబాదరగా ఇస్కూలు కాడికి పోయినాడు మనిషిగా మారిన గాడిద కోసం.

'ఖాజీసాబూ.. ఎక్కడ నా బిడ్డా? నా వరాల తండ్రి.. సూపించు' అని డిమాండు చేశాడు.

ఖాజీ ధోబీని ఎగాదిగా చూసి కోప్పడి 'ఏమయ్యా పెద్ద మనిషి.. ఇప్పుడా రావడం? వారం తర్వాత రమ్మన్నానేగానీ మధ్య మధ్యలో చూసి పోవద్దని చెప్పానా? పాపం మీ గాడిద మనిషిగా మారాక నువ్వు రాక, కడుపు నిండా గడ్డి లేక అల్లాడతా ఉంది. కానీ ఏ మాటకామాటే చెప్పుకోవాలి. మీ గాడిద బలే తెలివైనది. మనిషిగా మారాక గబగబా చదువు నేర్చేసుకొని ఇప్పుడు నాలాగే పిలకాయలకు పాటాలు కూడా చెప్తా ఉంది. పోయి పక్కన ఆ కిలాసులో పాటాలు చెప్తున్న నీ బిడ్డను చూసుకోపో. పోయే ముందు ఒక్క మాట. ముందు గడ్డి తీసుకొని వెళ్లు. అది తిన్నాక గాని ఏం మాట్లాడకు' అన్నాడు కడుపులో కడుపులోనే నవ్వుకుంటా.

పక్క కిలాసులో ఉండే టీచరుకూ ఈయనకూ పడదు. అందుకని ఆయన మీదకు ధోబీని ఉసిగొలిపినాడన్న మాట.

ధోబీ ఈ సంగతంతా తెలియక గబగబా గంపెడు పచ్చగడ్డి తీసుకొని పక్క కిలాసుకు పోయి కిలాసు బయట దానిని గుమ్మరించి లోపల పాఠాలు చెప్తా ఉన్న టీచరుని చప్పట్లు కొట్టి సైగ చేసి పిలిచాడు.

టీచరు పాఠం ఆపి ధోబీ వంక చూశాడు. ఆయనకు ఏమీ అర్థం కాలేదు.

అవతల ధోబీ ఏమో చప్పట్లు కొట్టిమరీ టీచరుని గడ్డితినమని పిలుస్తా ఉన్నాడు.

అసలే ఆ టీచరు కోపం మనిషి. ధోబీ చేస్తున్న సైగలు చూసేసరికి ఆయనకి రేగిపోయింది.

బయటికొచ్చి చేతిలో ఉన్న బెత్తంతో ధోబీని ఉతికి పారేశాడు.

ఆ దెబ్బలకు ధోబీ లబోదిబోమంటూ పరిగెత్తుకొని ఇంటికి చేరి భార్యతో 'ఒసే.. ఒసే.. మనం బలే దెబ్బ తినేసినాము. ఇన్నాళ్లు గాడిదగా ఉన్న బిడ్డ మనం ఏం చెప్తే అది చేశాడు. ఎన్ని కొడితే అన్ని పడ్డాడు. కానీ మనిషిగా మారాక అదంతా కడుపులో పెట్టుకొని నేను కనపడంగానే నన్ను ఉతికి పారేశాడు. అమ్మో... నాకు బలే బయంగా ఉంది.. ఏం చేద్దామే' అన్నాడు ఒళ్లంతా తడుముకుంటా.

భార్య బెదిరిపోయింది.

'అదేందది.. మనం బిడ్డను కావాలనుకున్నాముగానీ ఇలా తండ్రిని పట్టుకొని తన్నే గొడ్డును కావాలనుకున్నామా. వద్దు నాయనా.. మనకా మనిషి గాడిద వద్దు. ఉత్త గాడిదే చాలు.. అదే పదివేలు.. పోయి ఖాజీసాబు కాళ్ల మీద పడతావో చేతులు పట్టుకుంటావోగానీ మన గాడిదని మళ్లా మన గాడిదలాగే ఇంటికి తీసుకొనిరా' అని చెప్పింది.

ధోబీ ఏడ్చుకుంటా ఖాజీ దగ్గరకు పోయి జరిగింది చెప్పాడు.

ఖాజీ నవ్వి 'భాయ్... నేను చెప్తే నువ్వు వినవని ముందు చెప్పలేదు. మనుషులు బలే పొగరుబోతోళ్లు. ఇయ్యాల రేపు పెద్దలంటే బయపడని వాళ్లు గాడిదల కంటే హీనం గదా. నా మాట విని అట్టాంటి గాడిదల కంటే బంగారం లాంటి నీ గాడిదనే నువ్వు సాక్కో' అన్నాడు.

ఆ తర్వాత లోపల దాచి పెట్టిన గాడిదను తీసుకొని ధోబీకి అప్పగించాడు.

ధోబీ బతికినామురా తండ్రీ అనుకొని తన గాడిదను తీసుకొని పెద్దలంటే భయం భక్తులున్న దానినే బిడ్డలాగా సాక్కున్నాడు.

కథా నిలయం
55.64
శ్రీకాకుళం